# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- అమృత్‌సర్ - శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10న ప్రారంభిస్తారు.

- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(SIR) ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ఒక దిద్దుబాటు చర్య అని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు.

- ఈ ఏడాది చివరి నాటికి భారతదేశ లాజిస్టిక్స్ ఖర్చు 9 శాతానికి తగ్గుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విశ్వాసం వ్యక్తం చేశారు.

- ఎరువుల అక్రమ రవాణా, నిల్వలను నియంత్రించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు.

- ప్రధానమంత్రి ఉజ్వల యోజన వినియోగదారులకు 2025-26 సంవత్సరానికి 12 వేల కోట్ల రూపాయల సబ్సిడీలను కొనసాగించడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 10న అమృత్‌సర్ - శ్రీ మాతా వైష్ణోదేవి కత్రా మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును దృశ్య మాధ్యమ విదానంలో ప్రారంభిస్తారు. వందే భారత్ రైలు నంబర్ 26406 శ్రీ మాతా వైష్ణోదేవి కత్రా నుండి అమృతసర్‌కు నడుస్తుందని, రైలు నంబర్ 26405 మంగళవారం మినహా వారానికి ఆరు రోజులు అమృత్‌సర్ నుండి శ్రీ మాతా వైష్ణోదేవి కత్రాకు నడుస్తుందని జమ్మూ రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. రైలు నంబర్ 26406 ఉదయం 6:40 గంటలకు కాత్రా నుండి బయలుదేరి మధ్యాహ్నం 12:20 గంటలకు అమృత్‌సర్‌కు చేరుకుంటుంది. జమ్మూ, పఠాన్‌కోట్ కాంట్, జలంధర్ నగరం, వ్యాస్‌లో ఆగుతుంది. అదే రైలు అమృత్‌సర్ నుండి సాయంత్రం 4:25 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు కాత్రాకు చేరుకుంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై ప్రతిపక్ష పార్టీలు నిరసనతో ఈరోజు పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలు అస్తవ్యస్తంగా మారడంతో సభ వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశమైనప్పుడు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు సభ నివాళులర్పించింది. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రతిపక్ష పార్టీలు నిరసన కొనసాగించడంతో సభ 11 గంటలకోసారి, 12 గంటల కొకసారి వాయిదా పడింది. మధ్యాహ్నం 3 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదాయపు పన్ను బిల్లు-2025ను ఉపసంహరించుకోవాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నిరసన కొనసాగించడంతో సభాపతి సభను వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షా బంధన్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు, సోదరీమణుల మధ్య ప్రేమ, విశ్వాసాల ప్రత్యేకమైన బంధాన్ని రక్షా బంధన్ పవిత్ర పండుగ తెలియజేస్తుందని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(SIR) ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ఒక దిద్దుబాటు చర్య అని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. బీహార్‌లోని సీతామర్హిలోని పునౌరాధంలో 67 ఎకరాల విస్తీర్ణంలో 883 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించనున్న కొత్త జానకి మాతా ఆలయానికి ఈరోజు అమిత్ షా శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈ  సందర్భంగా నిర్వహించిన సభలో హోంమంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ భద్రతకు కట్టుబడి ఉన్నారన్నారు. ఓటర్ల జాబితా శుద్ధి ప్రక్రియ గతంలో జవహర్ లాల్ నెహ్రూ కాలంలో, 2003లో కూడా జరిగిందని గుర్తు చేశారు.

(వాయిస్ బైట్...31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ ఏడాది చివరి నాటికి భారతదేశ లాజిస్టిక్స్ ఖర్చు 9 శాతానికి తగ్గుతుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ విశ్వాసం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలోని రహదారుల మౌలిక సదుపాయాలలో గణనీయమైన మెరుగుదల ఈ తగ్గింపుకు కారణమని అన్నారు. లాజిస్టిక్స్ ఖర్చులలో ఈ తగ్గుదల దేశ ఎగుమతి రంగానికి పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుందని, ఎగుమతులు ఒకటిన్నర రెట్లు పెరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల వృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యతని, ఈ రంగం వృద్ధి స్థూల జాతీయ ఉత్పత్తికి గణనీయంగా దోహదపడుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎరువుల అక్రమ రవాణా, నిల్వలను నియంత్రించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ, ఎరువులను ముఖ్యమైన వస్తువుగా, ఎరువుల నియంత్రణ ఉత్తర్వు, FCO 1985 ఎరువుల ఉత్తర్వు, 1973 కింద నోటిఫై చేయబడిందని నడ్డా అన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, మళ్లింపు, అక్రమ రవాణా చేసే వ్యక్తి లేదా ఎరువుల కంపెనీపైనా శిక్షార్హమైన చర్యలు తీసుకోవడానికి తగినంత అధికారం ఈ ఉత్తర్వుల కింద రాష్ట్ర ప్రభుత్వాలకు  ఉందన్నారు. ఎరువుల అక్రమ రవాణాను నిరోధించడానికి సరిహద్దుల వద్ద నిఘా పెంచాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కోరామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వినియోగదారులకు 2025-26 సంవత్సరానికి 12 వేల కోట్ల రూపాయల సబ్సిడీలను కొనసాగించడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈరోజు ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ తీసుకున్న పలు కీలక నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ పథకం కింద 10 కోట్ల 33 లక్షలకు పైగా కుటుంబాలు ప్రయోజనం పొందాయని, ఏడాదికి 9రీఫిల్స్ కు సంబంధించి 14.2 కిలోగ్రాముల వంట గ్యాస్ సిలిండర్‌కు 300 రూపాయల సబ్సిడీ అందుతున్నదని తెలిపారు. సాంకేతిక విద్యా అభివృద్ధికి MERITE పథకానికి 4,200 కోట్ల రూపాయలు కేటాయించిందని పేర్కొన్నారు. IOCL, BPCL, HPCL సహా మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు 30 వేల కోట్ల రూపాయల పరిహారాన్ని కూడా కేబినెట్ ఆమోదించిందని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఫోను ద్వారా వివరణాత్మక సంభాషణ జరిపారు. ద్వైపాక్షిక అంశాలలో పురోగతిని సమీక్షించారు. భారతదేశం-రష్యా ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు చర్చించారు. ఉక్రెయిన్‌పై తాజా పరిణామాలను పంచుకున్నందుకు పుతిన్‌కు సామాజిక మాధ్యమ వేదికగా ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది చివర్లో భారతదేశంలో.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి తాను ఎదురుచూస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చైనా టియాంజిన్‌లో ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 1 వరకు జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ప్రధాని మోదీ పర్యటనను చైనా స్వాగతించింది. ఇదే విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గువా జియాకున్ స్పందిస్తూ.. ఈ శిఖరాగ్ర సమావేశం సభ్యదేశాల మధ్య సంఘీభావం, స్నేహం, ఫలవంతమైన ఫలితాలకు వేదిక కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 80,478 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరకు 765 పాయింట్ల నష్టంతో 79,857 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 232 పాయింట్ల నష్టంతో 24,363 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =